# ఆల్ ది బెస్ట్..



- నేటి నుంచి 13వరకు పదో తరగతి పరీక్షలు
- హాజరుకానున్న 12829 మంది విద్యార్థులు..
- 60కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సెంటర్ల వద్ద 144 సెక్షన్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్2, ప్రభాతవార్త:** విద్యార్థుల భవిష్యత్తుకు తొలిమెట్టు, అత్యంత కీలకమైన పదో తరగతి పరీక్షలకు జిల్లా అధాకార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం ఈనెల 13 వరకు పరీక్షలకు జరగనున్నాయి. ఈమేరకు 59కేంద్రాలతో పాటు, ఒక ప్రైవేట్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 12829 మంది విద్యార్థులు హాజరుకానుండగా అందులో 12561 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా, 268మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈసారి 11 పేపర్లకు బదులు 6 పేపర్లే ఉండనున్నట్లు ఇప్పటికే విద్యార్థులు తెలిపారు.

**ఇదీ పరీక్షా విధానం..**

పదో తరగతి పరీక్షల్లో భాగంగా ఫస్ట్ లాంగ్వేజీ కాంపోజిట్ కోర్సు పేపర్ పరీక్ష సమయం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.50గంటల వరకు ఉంటుంది. ఇందులో 9.30 గంటల నంచి 11 గంటల వరకు పార్ట్ ఏ, 11 గంటల నుంచి 11.30గంటల వరకు ఆబ్జెక్టివ్ పేపర్ పార్ట్ బీ, 11.30గంటల నుంచి 11.50 గంటల వరకు జవాబులు రాసిన పార్ట్ ఏ, బీ, పేపర్లను సేకరించడం, ఆ తర్వాత పార్ట్ -2 పరీక్ష రాసేందుకు పరీక్షా ప్రశ్నా పత్రాన్ని ఇచ్చేందుకు 20 నిమిషాలు ఉంటుందంది. విద్యార్థులు 11.50గంటల నుంచి 12.50 గంటల వరకు 20 మార్కుల పేపర్ రాయాల్సి ఉంటుంది.

అదే విధంగా సైన్స్ పేపర్‌కు సంబంధించి ఉదయం 9.30గంటల నుంచి 11గంటల వరకు పరీక్ష రాయాల్సి ఉంటుందని, 11గంటల నుంచి 11.20గంటల వరకు పేపర్ జవాబు పత్రాల స్వీకరణ, జీవశాస్త్రం ప్రశ్నాపత్రాన్ని విద్యార్థులకు కేటాయిస్తారు. 11.20గంటల నుంచి 12.20 గంటల వరకు జీవశాస్త్రం ప్రశ్నాపత్రం విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. చివరి 15 నిమిషాలు ఆబ్జెక్టివ్ పేపర్ సమాధానాలు రాసేందుకు కేటాయిస్తారు.

**పోలీసుల భద్రతా చర్యలు..**

- పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది గుమికూడరాదు.
- సెంటర్ వద్ద అన్ని జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలి.
- విద్యార్థులతోపాటు పరీక్ష నిర్వాహకులు సైతం కేంద్రంలోకి ఫోన్లు తీసుకెళ్లరాదు..
- సమయం ముగిశాక గేటు మూసివేశాక కేంద్రంలోనికి ఎవరినీ అనుమతించరు.

## సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలి..

**వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్..**

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్313వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బహుజనుల ఆరాధ్య దైవం ఆనాటి నిరంకుశ రాజరికపు పాలకులకు వ్యతి రేకంగా బడుగు, బలహీన వర్గాలకు ఏకం చేసి గో ల్కొండ కోటతో పాటు తెలంగాణ ప్రాంతంలో సుమారు 32కోటలను జయించి బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని అందించిన భారతదేశపు తొలి గొప్ప బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్వాయి పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బీసీ సంక్షేమ శాఖ ద్వారా గౌడ కులస్తులను గుర్తించి వారికి మద్యం షాపుల్లో రిజర్వేషన్ కల్పించింది అంతేకాక ఇతర సంక్షేమ కార్యక్రమాలను వారికి అందించి ఆర్థికంగా ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మెన్ లోక్‌నాథ్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ గట్టు యాదవ్, వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ పలుస రమేష్ గౌడ్, గౌడ కులస్థులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు

## మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి..

**- మహబూబ్‌నగర్ కలెక్టర్ జి రవినాయక్**

**- సర్ధార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళి**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** సమాజం కోసం పాటుపడిన మహనీయుల జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ జి రవినాయక్ అన్నారు. ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బహుజన రాజ్యాధికార పోరాటయోధుడు, దొరలు, మొఘలాయిల అరాచకాలను అరికట్టి బహుజన రాజ్యాన్ని స్థాపించిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పాపన్న వర్ధంతిని సర్కార్ అధికారికంగా నిర్వహిస్తున్నదన్నారు. ఇదేకార్యక్రమంలో భాగంగా పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ రవీంద్ర భారతిలో పాపన్నకు నివాళులర్పించారని మంత్రి తరఫున జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఒక మంచి సంకల్పంతో పనిచేస్తే ఏస్థాయికి అయినా వెళ్లొచ్చు అని సర్దార్ పాపన్న నిరూపించారన్నారు. ఆయన మార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సాయిలుగౌడ్ అన్నారు.



సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు

## బీటీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

**మూసాపేట,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** 44వ జాతీయ రహదారి నుండి చక్రపూర్ గ్రామానికి మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణానికి అలాగే తలగడ్డ గ్రామాలకు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి భూమిపూజ చేశారు. 44వ జాతీయ రహదారి నుండి చక్రపూర్ కు వెళ్లే రహదారి రెండు కోట్ల 45లక్షల రూ.వ్యయంతో నిర్మించబోయే బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం 44వ జాతీయ రహదారి జానంపేట నుండి తాళ్లగడ్డ కు వెళ్లే రహదారి పై రూ.1కోటి25లక్షల వ్యయంతో నిర్మించబోయే హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అంతకుముందు ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న తమ గ్రామానికి బీటీ రోడ్డుమంజూరు కావడంతో చక్రాపూర్ గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి పై పూలవర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఇంద్రయ్య సాగర్, ఎంపీపీ కళావతి కొండయ్య, సర్పంచులు వన్నం శ్రీనివాసులు, శైలజ ప్రకాష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చంద్రశేఖర్ లలిత, మండల సింగిల్‌విండో అధ్యక్షుడు బండ వెంకటేశ్వర్ రెడ్డి, మండల రైతు సంఘం అధ్యక్షుడు భాస్కర్ గౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండి జమీర్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

- అనుమతుల చాటున అక్రమ వ్యాపారం..
- సీసీ రోడ్లు, మన ఊరు మన బడి పేరుతో అనుమతులు..
- ప్రైవేటు నిర్మాణాలకు ఇసుక రవాణా..
- అనుమతులు ఒక చోట ఇసుక తవ్వకాలు మరోచోట..
- రెండు ట్రిప్పులకు అనుమతి పగలు రాత్రి అక్రమ రవాణా..
- వెల్టూరు చెరువు, బుర్రవాగు నుండి ఇసుక తరలింపు..
- అక్రమ దందాకు నేతలు, అధికారుల సహకారం..స్వాహాకార్యం..

మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

# పెద్దమందడిలో అడ్డగోలుగా.. ఇసుక దందా..!



ఎలాంటి అనుమతులు లేకుండా బుర్రవాగు నుండి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్



అక్రమంగా ఇసుక తరలిస్తూ ట్రాక్టర్ ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందడంతో పాటు మరొకరు గాయపడ్డ దృశ్యం(ఫైల్ )

**పెద్దమందడి,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** సర్కారు ఆదేశాలు..మైనింగ్ నిబంధనలను పాతరేసి పెద్దమందడి మండల పరిధిలోని వెల్టూరు వేణుగోపాల సముద్రం చెరువు, బుర్రవాగులో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు కొనసాగిస్తున్నారు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మన ఊరు మన బడి పథకాన్ని, సీసీ రోడ్లు అమలుచేస్తున్న నేపథ్యంలో అక్రమార్కులు ఇదే అదునుగా భావించి సీసీ రోడ్లు, మన ఊరు మన బడి పేరుతో అనుమతులు తీసుకొని ఒక్కో ట్రాక్టర్ ఇసుకను ప్రైవేటు నిర్మాణాలకు రూ.4వేల నుండి రూ. 4500 వరకు విక్రయిస్తున్నారు. సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి అయి నెలలు అయ్యింది. అందుకు సంబంధించిన బిల్లులు కూడా ప్రభుత్వం సీసీ రోడ్లు వేసిన కార్యకర్తలకు చెల్లించినప్పటికీ ఇంకా సీసీ రోడ్ల పేరుతో ఇసుక పర్మిషన్లు ఉపయోగించడం హాస్యాస్పదం, వివాదాస్పదంగా మారింది. ఇక మన ఊరు మన బడి విషయానికి వస్తే మండలం మొత్తంలో మొదటి విడతలో కొన్ని గ్రామాల్లో మాత్రమే పాఠశాలల మరమ్మత్తు పనులు జరుగుతున్నాయి. కానీ పనులు జరగని పాఠశాలల పేరు మీదకూడా ఇసుక పర్మిషన్లు తీసుకోవడం విశేషం. ఇక అనుమతుల విషయానికొస్తే చిలకటోనిపల్లి వాగు పేరుతో పర్మిషన్లు ఇస్తున్నప్పటికీ ఇసుక వ్యాపారులు బుర్రవాగులో ఇసుకను తవ్వుతున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రోజుకు 1లేదా2 ట్రిప్పులకు పర్మిషన్లు ఇస్తే రోజు మొత్తం 8నుంచి 10 ట్రిప్పుల ఇసుకను అక్రమంగా తరలించడంతో పాటు ఇది చాలదు అన్నట్లుగా రాత్రిపూట కూడా అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇసుక అనుమతులను అటు రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖ అధికారులు తనిఖీ చేయకపోవడంతో నిరంతరాయంగా ఇసుక అక్రంగా రవాణా అవుతుంది. రాత్రి పూట ఎవరైనా ఇసుక ట్రాక్టర్ లను ఆపితే పొద్దుగాల లేదా సాయంత్రం ట్రాక్టర్ పంక్చర్ కావడంతో ఇప్పుడు వస్తున్నామని చెప్పి దాటవేస్తున్నారు. అక్రమ ఇసుక దందాకు పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అధికారుల సహాకారం పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు, నాయకుల సహకారంతో స్వాహాకార్యాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా ఇసుక దందాను నిర్వహిస్తున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం చిలకటోనిపల్లి ఇసుక రీచ్ కు అనుమతులు ఉన్నప్పటికీ వాగులో నీరు ఉండడంతో ప్రస్తుతం అనుమతులను రద్దు చేసింది. ఇదే అదునుగా భావించి చిలకటోనిపల్లి, మోజర్ల, వెల్టూరు, కనిమెట్ట గ్రామాలకు చెందిన ఇసుక ట్రాక్టర్ల యజమానులు పెద్దఎత్తున అధికారులకు, నాయకులకు అమ్యమ్యాలు ముట్టచెప్పి ఇసుక పర్మిషన్ లు పొంది ప్రైవేట్ నిర్మాణాలకు సరఫరా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వెల్టూరు కు సమీపంలో ఉన్న రెండు కంపెనీల్లో కొనసాగుతున్న ప్రైవేట్ నిర్మాణాలకు ఎలాంటి అడ్డుఅదుపు లేకుండా రాత్రి పగలు ఇసుక రవణా కొనసాగుతుంది. ఇసుక అనుమతులు కూడా విచ్చలవిడిగా ఎలాంటి విచారణ లేకుండానే ఇస్తున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ నాయకులు ఎవరికి సిఫారసు చేస్తే ఆ ట్రాక్టర్లకే ఇసుక రవాణా అనుమతులు వస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. గత 20రోజుల క్రితం ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఓ ట్రాక్టర్ మోజర్ల శివారులో ఇద్దరు వ్యక్తులను ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందగా మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. అయినప్పటికీ పోలీసులు అక్రమ ఇసుక రవాణా పై ఎందుకు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.




మద్దిగట్లలో ప్రభుత్వ పనికోసం అధికారులు జారీ చేసిన ఇసుక అనుమతి పత్రం

# కార్యకర్తలే మా బలగం..

- సంక్షేమ పథకాలను ఇంటింటీ చేరవేయాలి
- 75ఏండ్లలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేసిందేమి లేదు..
- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య కార్యకర్తలు వారధిలా ఉండాలని, కార్యకర్తలే పార్టీకి బలమని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. బాలానగర్ మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 75ఏండ్లలో కాంగ్రెస్, బీజేపీ, టీడీపీలు తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. చెంతనే కృష్ణమ్మ పారుతున్నా కనీసం గంటెడు నీళ్లు ఇవ్వని దుస్థితి ఉండేదన్నారు. ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఆపేందుకు జిల్లా కాంగ్రెస్ నాయకులు కుట్రలు పన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం చావు దాకా వెళ్లి తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను నేడు అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. మతం పేరిట అమాయకులను, యువతను తప్పుదోవ పట్టిస్తూ ఓట్లు దండుకొంటూ నీచపు రాజకీయాలకు పాల్పడుతున్న పార్టీలపై యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలే కీలకమన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలకు తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. మాకు గుర్తింపు లేదు, మమ్మల్ని గుర్తిస్తలేరని అపోహ ఉండొద్దని సమయం వచ్చినప్పుడు తప్పక మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని , సంక్షేమ పథకాన్ని ప్రజలకు చేర్చాలని కోరారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం చేరిందన్నారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనాల ఇన్‌చార్జి ఎమ్మెల్సీ కశిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు పడిన గోస దేశ ప్రజలు పడొద్దనే బీఆర్ఎస్ పార్టీ పెట్టి, సంక్షేమ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కేసీఆర్ నడుం బిగించారని తెలిపారు. కాంగ్రెస్ బీజేపీలే తెలంగాణను ఆగం చేసేందుకు సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశానికి ఎమ్మెల్యే ఆయన సతీమణితో కలిసి వచ్చి కార్యకర్తలకు కుటుంబాలకు భోజనం వడ్డించారు. వారితోనే కలిసి ఆత్మీయంగా పలకరిస్తూ సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో గిరిజన కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, డీసీఎంఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్, నాయకులు నాగిరెడ్డి, శ్రైశైలం యాదవ్ పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

## పథకాలు మావే, నిధులు మావే..!

**- లిక్కర్, లీకేజీల చరిత్ర మీది..**

**- బీజేపీ నేత, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం నిధులను ఉపయోగి స్తూనే బడ్జెట్ కేటాయించడం లేదు, నిధులు ఇవ్వడం లేదంటూ బీజేపీ ప్రభుత్వాన్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నారని బీఆర్ఎస్ నేతలపై బీజేపీ నేత, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి ఫైర్ అయ్యారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లిక్కర్ స్కాం, పేపర్ లీకేజీతో తెలంగాణ ఆగం చేశారని, 30లక్షల మంది అభ్యర్థుల భవిష్య త్తుతో చెలగాటం ఆడుతున్నారన్నారు. మిగులు తెలంగాణను దివాలా తీయించింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. 2014లో రూ.16వేల కోట్ల మిగులు రాష్ట్రంగా ఉండగా నేడు రూ.5లక్షల కోట్ల అప్పుల తెలంగాణగా చేశారన్నారు. రూ.35వేల కోట్లతో పూర్తి కావాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టు లక్షా 35 వేల కోట్లు ఖర్చు పెట్టి నేటికీ అసంపూర్తిగా ఉందని, ఒక ఎకరాలకు కూడా నీళ్లు పారలేదన్నారు. జడ్చర్ల నుంచి మహబూబ్‌నగర్ వరకు ఫోర్ వే, బ్రిడ్జి పనులు, ఇంటింటికీ నీళ్లు, చేప పిల్లల పంపిణీ, గ్యాస్ సిలిండర్ లాంటి మొత్తం పథకాలకు కేంద్రమే నిధులు కేటాయిస్తుందన్నారు. బీఆర్ఎస్ నేతలు మాత్రం నిధులు ఇవ్వలేదంటూ ఉల్టా ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ చేసి లక్షలాది మంది విద్యార్థులను ఆగం చేశారన్నారు. లిక్కర్ స్కాంలోనూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ దాకా తాకట్టు పెట్టారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, మాజీ మంత్రి పీ చంద్రశేఖర్, నాయకుడు ఎన్‌పీ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నేత జితేందర్‌రెడ్డి

# చరిత్రలో ప్రజల నమ్మకాన్ని ఎవరూ మార్చలేరు..



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్ రెడ్డి



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ప్రజలు

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** చరిత్రలో ప్రజల నమ్మకాన్ని ఎవరూ మార్చలేరని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. దేవరకద్ర నియోజకవర్గం మదనాపురం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు మునుపటికంటె మెరుగైన స్థితిలో జీవనం సాగిస్తున్నారని, గ్రామాల్లో పారిశుద్య వ్యవస్థ మెరుగైందని ఆయన పేర్కొన్నారు. హరితహారంతో చెట్ల పెంపకం మూలంగా గ్రామాలు పచ్చగా కనిపిస్తున్నాయని, ఈ పరిస్థితిలో మరింత మార్పు రావాలని ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలని అప్పుల్లేని జీవనం సాగించాలని ఆయన కోరారు. అందుకే కార్యకర్తలతో మమేకం అయ్యేందుకే ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. గ్రామాలకు నీళ్లొచ్చాయా, పంటలు పండుతున్నాయా, ప్రతి ఊర్లో పెన్షన్లు వస్తున్నాయా లేదా అని ప్రజలను అడిగారు. అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తుందని అన్నారు. వివిధ పథకాల ద్వారా 9ఏళ్లలో గ్రామాలకు వచ్చిన నిధులు వందల కోట్లు ఉంటాయని తెలిపారు. చరిత్రలో ప్రజల నమ్మకాన్ని ఎవరూ మార్చలేరని, తెలంగాణ ప్రతి గడపకు ఏదో ఒక ప్రభుత్వ పథకం అందుతుందని తెలిపారు. రైతు బంధు, రైతు భీమా, కేసీఆర్ కిట్, 24గంటల ఉచిత కరెంట్, ఆసరా పెన్షన్, అమ్మఒడి, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, దళితబంధు ప్రతి ఒక్కరి ఏదో ఒక పథకం కింద లబ్ది చేకూరుతుందని అన్నారు. ఒకనాడు సర్కారు దవఖానాలో అడుగు పెట్టాలంటే ప్రజలు భయపడేవారని నేడు కొన్ని జిల్లాల కలెక్టర్లు కూడా ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకాన్ని పెంచేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేయించుకుంటున్నారని అన్నారు. నేడు తెలంగాణ సర్కారు దవఖాన్ల స్థాయి పెరిగిందని అన్నారు. విద్యారంగంలో 29వేల పాఠశాలలను మన ఊరు మన బడి పథకం కిదం ఆధునీకరిస్తున్నామని, అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నామని అన్నారు. అన్ని వర్గాల విద్యార్థులకు సంక్షేమ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బడి ఈడు పిల్లలు చదువుకు దూరం కావొద్దని, ప్రైవేటులో డబ్బులు పెట్టి కొనుక్కోవద్దన్నది ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గత పాలకులకు పొలాలకు నీళ్లివ్వాలి, ప్రజల చేతికి పని దొరకాలని, విద్య, వైద్య రంగాలు బలోపేతం చేయాలన్న ఆలోచన రాలేదని అన్నారు. ఓట్లు వేయించుకొని 5ఏళ్లు మాయమై మళ్లీ ఓట్లప్పుడు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకుని కనుమరుగవుతారని అన్నారు. ఎవరు ఎంత మొక్కినా ప్రజలు వారికి పని జరిగిందని నమ్మితేనే ఓట్లు వేస్తారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- తెలంగాణ లో ప్రతి గడపకు ఏదో ఒక ప్రభుత్వ పథకం అందుతుంది..
- నేడు తరం మారింది..ప్రజల ఆలోచన మారింది..
- ఎవరు ఎంత మొక్కిన ప్రజలు పని జరిగిందని నమ్మితేనే ఓట్లు వేస్తారు..
- గ్రామాల్లో ప్రజలు మునపటికంటే మెరుగైన స్థితిలో జీవనం సాగిస్తున్నారు..
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి..



గిరిజన మహిళలతో మంత్రి నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యే ఆల

## గడప గడపకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను తీసుకెళ్తున్నాం...

**జీడిపల్లి గ్రామంలో ఘనంగా హత్ సే హత్ జోడో కార్యక్రమం**

**కల్వకుర్తి, ఏప్రిల్ 02 ప్రభాతవార్త:**కల్వకుర్తి మండలం జీడిపల్లి గ్రామంలో హత్ సే హత్ జోడో కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ నాయకులు అంజి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి హాజరై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి గడప గడపకు కరపత్రాల పంపిణీ చేసి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాల్లో ఒక్కటైనా డబుల్ బెడ్‌రూం ఇండ్లు, దళితులకు మూడు



ఎకరాలు ఇవ్వకుండా మోసపూరిత వాగ్దానాలను చేసి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. రాష్ట్రాన్ని, దేశాన్ని అప్పుల మయం చేసి దోచుకుంటున్నారని విమర్శించారు. వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రజలకు వివరించి ఖచ్చితంగా రాబోయే కాంగ్రెస్‌ప్రభుత్వం వాటిని నేరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లెపల్లి జగన్, శ్రీనివాస్, చంద్రకాంత్‌రెడ్డి, రేణయ్య, రాపోతు అనిల్‌గౌడ్, జంగయ్యగౌడ్, దళపతిగౌడ్, జనార్ధన్‌రెడ్డి, వంశీ, సుదర్శన్, అనిల్‌కుమార్, శంకర్ తదితరులు ఉన్నారు.

## విప్లవకారుడు... సర్వాయి పాపన్నగౌడ్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** సర్వాయిపాపన్న ఒక విప్లవకారుడని, ఆదర్శవంతుడని అదనపు కలెక్టర్ రెవెన్యూ మోతి లాల్ కొనియాడారు. ఆదివారం కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 313వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ కల్పన భాస్కర్, సంఘ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రను భావితరాలకు అందించి వారు సమాజ సేవకు చేసిన సేవలను గుర్తు పెట్టు



కోవాల్సిన అవసరం ఉందన్నారు. సర్వాయి పాపన్న తన స్నేహితుడిని తుర్కష సైనికులు అవమానించి కొట్టడానికి కాలు లేపినందున సైనికుడి తల నరికి చంపాడు. అన్యాయాన్ని సహించని సర్వాయి పాపన్న తుర్కష రాజులను ఎదిరించి పేదలకు సహాయం చేసి ఆదర్శంగా నిలిచాడు. సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

## బాధితులకు అండగా టీఆర్ఎస్ ప్రభుత్వం..

**-ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేసిన గోళి శ్రీనివాస్‌రెడ్డి**

**కల్వకుర్తి, ఏప్రిల్ 02 ప్రభాతవార్త:**రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం బాధితులకు బాసటగా నిలుస్తోందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాలకు వైద్య ఖర్చులను, ప్రమాదవశాత్తు చనిపోతే కుటుంబాలకు ప్రభుత్వం చేయూతనందించడం హర్షదాయకమని ఆయన అన్నారు. చారకొండ మండలానికి చెందిన మల్లేషంకు మంజూరైన రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడు



గు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పనిచేస్తున్నారన్నారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి పండుగ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

## చికిత్స పొందుతున్న వ్యక్తికి ఐక్యత ఆర్థికసాయం..

**వెల్దండ, ఏప్రిల్ 02 ప్రభాతవార్త:**మండల పరిధిలోని శంకర్‌కొండ తాండకు చెందిన ఇస్లావత్ మాస్య గత కొన్ని రోజుల నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ హైదరాబా ద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స పొందుతున్న మాస్య కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం కోసం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని కలిసి విషయాన్ని వివరించడంతో... స్పందించిన ఆయన మానవతా దృక్పథంతో మాస్య చికిత్స నిమి





త్తం రూ. 10వేలను ఫౌండేషన్ సభ్యుల ద్వారా అందించారు. కార్యక్రమంలో జీవన్, రాజు, రాములు, గోపి, రవీందర్, రవి, సుక్య, అంజ్య, ఈశ్వర్, శ్యాంతో పాటు తదితరులు ఉన్నారు.

## కలిసికట్టుగా పనిచేద్దాం...



**వెల్దండ, ఏప్రిల్ 02 ప్రభాతవార్త:**మాదిగల అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేద్దామని మాదిగల ఐక్యవేదిక, కార్యనిర్వాహక సభ్య లు మాజీ ఎంపీపీ పకాడి జయప్రకాష్, న క్కరకంటి శ్రీనివాసులు, సర్పంచ్ దార్లకుమా ర్, మండల అధ్యక్షులు మీసాల అంజయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివా రం మండల మాదిగ ఐక్య వేదిక నూతన కా ర్యవర్గ కమిటీని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రాజకీయ, ఉపాధి, విద్య, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా ప్రణాళిక బద్ధంగా కార్యాచరణను రూపొందించుకొని సమిష్టిగా పనిచేయాలని, రాబోవు రోజుల్లో మాదిగలందరు పార్టీలకతీతంగా అన్ని గ్రామాల్లో ఉమ్మడి రాజకీయ ఏజెండా అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు తాండ్ర జంగయ్య, ప్రభాకర్, సోమయ్య, దుబ్బ నాగేష్, పుల్లయ్య, శేఖర్, అంజయ్య, సామేల్, గున్నేళ్ళ శ్రీను, జగదీశ్వర్, వెంకటయ్య, రామస్వామి, జగన్, లింగం తదితరులు ఉన్నారు.

## గ్రామాన్ని సందర్శించిన రాష్ట్ర స్థాయి అధికారులు

**వెల్దండ, ఏప్రిల్02 ప్రభాతవార్త:**వెల్దండ మండలం లింగారెడ్డిపల్లి గ్రామాన్ని రాష్ట్ర స్థాయి పరిశీలన బృందం డీఈఈ నాగభూషణం ఆధ్వర్యంలో సందర్శించారు. కాల్వ వెంట పెంచుతున్న ఈత, ఖర్జూరతో పాటు 6 రకాల మొక్కలను పరిశీలించారు. ఉపాధి హామీ పనులను, వన నర్స రీలను పరిశీలించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించి సరైన సమయంలో కూలీలకుడబ్బులు అందే విధంగా, వేసవి కాలం దృష్ట్య



వారికి అన్ని రకాల వనరులు కల్పించాలన్నారు. నాటిన ప్రతి మొక్కను బ్రతికించాలని సూచించారు. కార్యక్రమంలో ప్లానిటేషన్ మేనేజర్ శివరాములు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ ఈశ్వర్‌జీ, ఈసీ దేవేందర్, టీఏ రాజ్‌కుమార్, సత్యనారాయణ, సర్పంచ్ చంద్రమ్మ, ఉప సర్పంచ్ ఎండీ. అలీ, సెక్రటరి మురారిచారి తదితరులు ఉన్నారు.

## శివాలయ పునర్నిర్మాణానికి విరాళం అందజేత...

**కల్వకుర్తి, ఏప్రిల్ 02 ప్రభాతవార్త:**శివాలయ పునర్నిర్మాణం కొరకు తన వంతు సహకారాన్ని అందిస్తామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఆదివారం ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి 3వ విడతలో భాగంగా రూ.1లక్ష చెక్కును ఆలయ నిర్వాహకులకు అందించారు. మిగతా రూ.2లక్షలను విడతల వారిగా అందిస్తామని, ఆలయ నిర్మాణాభివృద్ధికి ఫౌండేషన్ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీపతి రాజు, గణేష్, హసన్, షఫీ, జగన్, కొండల్, కాలనీ వాసులు, ఆలయ కమిటీ నిర్వాహకులు రమేష్‌యాదవ్, రాజు, కృష్ణయ్య, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



# తిరుచ్చిసేవపై ఊరేగిన వెంకటేశ్వరస్వామివారు..

**- అలంకరణలో శ్రీదేవిభూదేవి సమేతంగా స్వామివారి దర్శనం**

**దేవరకద్ర,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామి వారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై స్వామివారిని ఊరేగించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శ్రీదేవిభూదేవి సమేతంగా స్వామివారి తిరుచ్చిసేవను నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాలు, భక్తుల హరినామశ్చరణ, కాగడాల వెలుతురులో స్వామి వారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని మళ్ళీ గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిద పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు..**

మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసేవపై శ్రీదేవిభూదేవి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు, బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాస రాజు, ప్రధాన పూజారులు రాజేశ్, నరసింహ్మయ్య, పాలకమండలి సభ్యులు, పర్యవేక్షకుడు నిత్యానందచారి, సిబ్బంది సుదర్శన్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారు



మన్యంకొండలో తిరుచ్చిసేవ నిర్వహిస్తున్న పురోహితులు

# చివరిదశలో ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులు..!

**దేవరకద్ర,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** దేవరకద్రలో నిర్మించే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులు చివరిదశలో ఉన్నాయి. స్థానిక సంతబజారు నుంచి పాతబస్టాండు, కొత్తబస్టాండు మీదుగా కొత్త సినిమాటాకీసు వరకు దాదాపు రూ.24కోట్లతో ఈ వంతెనను నిర్మిస్తున్నారు. కొన్నేళ్ళ క్రితం ఈ వంతెన పనులను ప్రారంభించారు. కొన్ని అనివార్యకారణాల కారణంగా ఈ వంతెన పనులకు కాస్త జాప్యం జరిగింది. అయితే ఎట్టకేలకు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కృషితో వంతెన పనులు వేగవంత అయ్యాయి. వంతెన పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ప్రస్తుతం వంతెన పై బిటి రోడ్డు పనులు జరుగుతున్నాయి. దేవరకద్రలోని రైల్వే ట్రాక్‌పై ఈ వంతెనను నిర్మిస్తున్నారు. రాయచూర్ అంతరాష్ట్ర రహదారిపై ఉన్న రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ వంతెన లేక మాటిమాటికి గేటు పడుతుండటంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారు. అంతరాష్ట్ర రహదారి కావడంతో ఈ మార్గంలో ప్రతి రోజు వందలాది వాహనాలు వెళ్తుంటాయి. అలాంటప్పుడు ఒక్కో సారి రైళ్ళ క్రాసింగ్ ఉన్నప్పుడు గేటు వద్ద ప్రయాణికులు నరకాన్ని చవి చూస్తున్నారు. వంతెనకు ఇరుపక్కల సర్వీసు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు. ప్రయాణికులు దుమ్ము, దూళితో పడే అవస్థలు అన్నిఇన్ని కావు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ప్రయాణికులకు ఎంతో ప్రయోజనంగా ఉంటుంది. ఫ్లైఓవర్ వంతెన ఏర్పాటు చేసినప్పటికి రైల్వే గేటును మాత్రం అలాగే ఉంచాలని ప్రజలు, వ్యాపారస్థులు కోరుతున్నారు. లేనిచో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు.



దేవరకద్రలో నిర్మించిన ఫ్లైఓవర్ వంతెన

**ఎమ్మెల్యే కృషితోనే త్వరగా పనులు: కుర్వ కెంగూరి శ్రీకాంత్‌యాదవ్, బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు**

ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రత్యేక కృషి వల్లే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులు త్వరగా జరుగుతున్నాయి. త్వరలో ఈ వంతెనను ప్రారంభిచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సంబందిత శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరవుతున్నారు. వంతెన పనులు పూర్తయితే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. పనులు త్వరలో పూర్తవుతాయి.



కుర్వ కెంగూరి శ్రీకాంత్‌యాదవ్

# ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి..

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ హమాలీలు, న్యూ బస్టాండ్ ఆటో వర్కర్స్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ కార్యాక్రమం జరుగుతుందని, మజ్దూర్ కిసాన్ సంఘర్ష ర్యాలీ ఉద్దేశాలను వివరించారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా ఛలో ఢిల్లీ కార్యక్రమం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం సంపన్నులకు దేశాన్ని దోచి పెడుతుందని అన్నారు. కార్మికులు, రైతులు, కూలీలు ప్రజలకు బారాలు వేస్తుందని విమర్శించారు. ప్రదానమంత్రి నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక కార్పోరేట్ టాక్స్ 12లక్షలలు మాఫీ చేశారని ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ఎంపీ పేరుతో రాణి భాగ్యల కింద రూ.12లక్షల కోట్లు ధనవంతులకు మాఫీ చేశారని విమర్శించారు. కానీ సాధారణ ప్రజలకు అన్ని రకాల ధరలు పెంచి భారాలు, జీఎస్టీ పేరుతో పెంచారన్నారు. డీజీల్, పెట్రోల్, గ్యాస్ ధరలు, నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన అన్నారు. కనీస వేతనం కింది తరగతి కార్మికుడికి కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ గవర్నమెంట్ రోజు కూలీ 175రూ. నిర్ణయించడం సరైనది కాదని అన్నారు. ప్రభుత్వ సంస్థలన్నింటినీ కారుచౌకగా రూ.6లక్షల కోట్లు కావాలి అంబానీ, ఆయన అనుచరులకు అమ్ముకుంటున్నారని దాన్ని పరిగణించాలని పిలుపునిచ్చారు. 29కార్మిక చట్టాలు ఉంటే వాటిని రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను మార్చాలని, ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ కార్యక్రమానికి అన్ని రంగాల కార్మికులు, రైతులు, కూలీలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా సహకార దర్శి గోపాలకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు నందిమల్ల రాములు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ అధ్యక్షులు రాములు, కార్యదర్శి ముంత రాములు, కొత్త బస్టాండ్ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గంధం రాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.





ర్యాలీలో పాల్గొన్న సీఐటీయు నాయకులు

# ఖిల్లాలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 313వ వర్ధంతి..

**ఖిల్లాఘణపురం,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 313వ వర్ధంతి వేడుకలను గౌడ సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి వారి యొక్క ఆశయ సాధన కోసం బహుజనులు రాజ్యానాయకులు దిశగా ఏకం కావాలని ఈ సందర్భంగా ఆంజనేయులు గౌడ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షులు గోద చిన్న ఆంజనేయులు గౌడ్, మాజీ సర్పంచ్ టి.కృష్ణయ్య గౌడ్, డా.నరేందర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, వడ్డెర సంఘం నాయకులు భూమయ్య, బీజేపీ అధికార ప్రతినిధి బుచ్చిబాబు గౌడ్, మండల గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి టి.మాధవ్‌గౌడ్, అప్పిరెడ్డిపల్లి, సత్యం గౌడ్, గణపురం గౌడ్, సంఘం అధ్యక్షులు బుర్ర ఎల్లగౌడ్, కమలోద్దిన్‌పూర్ అధ్యక్షులు గుండ్రాతి యాదయ్య గౌడ్, అంతయ్యపల్లి గడ సంఘం అధ్యక్షుడు హనుమ నరసింహులు గౌడ్, ఉప్పరపల్లి గౌడ సంఘం అధ్యక్షులు ఎ.శ్రీనివాసులు గౌడ్, నాయకులు అల్లాడి చంద్రయ్య గౌడ్, గోదా పెద్ద ఆంజనేయులు గౌడ్, అల్లాడి రాజు గౌడ్ తోక శ్రీనివాస్ గౌడ్, సత్తన్న గౌడ్, సూరాయిపల్లి భాస్కర్ గౌడ్, ప్రతాప్ గౌడ్, ఎం.ఆంనేయులు గౌడ్, నరేందర్ గౌడ్, వియన్ గౌడ్, నాగార్జున గౌడ్, వెంకటంపల్లి జగన్నాధం గౌడ్, తోక గిరిబాబు గౌడ్, శేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

# వనపర్తి పంచాంగ కర్తలకు బిరుదుల ప్రదానం..

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ పంచాంగకర్తలు ఒరుగంటి మనోహర్ శర్మ సిద్ధాంతి, ఆయన కుమారుడు ఒరుగంటి నాగరాజు శర్మ సిద్దాంతిలకు ఒంగోలుకు చెందిన తేజస్వి జ్యోతిషవాస్తు వేదన పరిశోధన కేంద్రం నిర్వాహకులు బిరుదుల ప్రధానం చేశారు. ఆదివారం ఒంగోలు నగరంలో నిర్వాహకులు జూటూరి భానుమూర్తి సిద్దాంతి ఆధ్వర్యంలో తమ సంస్థ రజతోత్సవ వేడుకలు నిర్వహించి పలువురు ప్రముఖ పంచాంగకర్తలకు ఉగాది పురస్కారం, బిరుదులు ఇవ్వడం జరిగింది. దీనిలో భాగంగా ఒరుగంటి మనోహరశర్మ సిద్దాంతికి దైవజ్ఞరత్న అవార్డు, అలాగే ఒరుగంటి నాగరాజ శర్మ సిద్దాంతికి సిద్దాంత రత్న, జ్యోతిషరత్న బిరుదులు అందజేశారు. ప్రముఖ శృంగేరి ఆస్థానపండితులు సీఎం కేసీఆర్ రాజగురువులు ఫణి శశాంక శర్మ, శ్రీశైలం ఆస్థాన సిద్దాంతి బుట్టె వీరభద్ర దైవజ్ఞ, తిరుమల తిరుపతిదేవస్థాన పురోహితులు వంశీ కుమార్ శర్మ, సాయినాథ శర్మల చేతుల మీదుగా బిరుదులను స్వీకరించామని మనోహర్ శర్మ, నాగరాజు శర్మలు తెలిపారు. పంచాంగ కర్తలుగా తాము చేస్తున్న సేవలను గుర్తించి శోభకృత్ నామ ఉగాది పురస్కారంతో పాటు బిరుదులు అందజేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.





బిరుదులు అందుకుంటున్న వనపర్తి పంచాంగకర్తలు

## మన్యంకొండ సన్నిధిలో బీజేపీ మహిళా మోర్చా నేతలు



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:** ప్రవాస్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్విని జిల్లా మహిళా మోర్చా సభ్యులతో కలిసి ఆదివారం పేదల తిరుపతి మన్యంకొండను దర్శించుకున్నారు. అనంతరం శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట మహబూబ్‌నగర్ గ్రామీణ మండల అధ్యక్షుడు రాజుగౌడ్, మండల ఇన్‌చార్జి శేరి పాండురంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు పద్మవేని, జనరల్ సెక్రెటరీ సాహితీరెడ్డి ఉన్నారు.

## కౌకుంట్లలో చలివేంద్రం ప్రారంభం..



**దేవరకద్ర, ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. స్థానిక బస్టాండు కూడలి వద్ద గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక వేత్త జాంగీర్ కౌకుంట్లలో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాంగీర్ మాట్లాడుతూ ఎండలను దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తీర్చడానికి కృషి చేస్తానన్నారు. వారికి ఎళ్ళవేళలా అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో యంపీటీసీ కిష్టన్న, మాజీ యంపీపీ గోపాల్, నాయకులు తుమ్మల శేఖర్‌రెడ్డి, సాంభశివుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆయకట్టుకు కొనసాగుతున్న కోయిల్‌సాగర్ నీటిసరఫరా

**-14.5 ఫీట్లకు తగ్గిన కోయిల్‌సాగర్ నీటిమట్టం**



**దేవరకద్ర,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్ నుండి ఆయకట్టుకు కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిసరఫరా కొనసాగుతుంది. గత కొన్ని రోజుల క్రితం ఆయకట్టుకు నీటిసరఫరాను సంబందిత అధికారులు ప్రారంభించారు. ఈ విధంగా ఆయకట్టుకి నీటిని విడుదల చేయడం ఇది 6వ సారి. ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తుండటంతో ప్రాజెక్టులో నీటిమట్టం 14.5 ఫీట్లకు తగ్గింది. ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తుండటంతో ప్రాజెక్టులో క్రమేపి నీటిమట్టం తగ్గుతూ వస్తుంది. ఆయకట్టుకు నీటిసరఫరాను సంబందిత అధికారులు విడుతల వారిగా కొనసాగిస్తున్నారు. అయితే ఆయకట్టుకు నీటిసరఫరా చేస్తుండటంతో ప్రాజెక్టు పరిదిలోని దేవరకద్ర, మరికల్, ధన్వాడ మండలాలకు చెందిన ఆయకట్టు రైతులు ముమ్మరంగా పంటలను పండించుకొంటున్నారు.



# తాటిపాముల గ్రామానికి రాష్ట్రస్థాయిలో పేరుతేవాలి..

**10వ తరగతి చదివే 15మంది విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేసి దాడి యోగానందరెడ్డి..**

**శ్రీరంగాపూర్,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** తాటిపాముల గ్రామంలో 10వ తరగతి చదువుతున్న 15మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్న వేళ తాటిపాముల ముద్దుబిడ్డ, బీఆర్ఎస్ వనపర్తి జిల్లా మీడియా సెల్ కన్వీనర్ దాడి యోగానంద రెడ్డి వారి అమ్మ-నాన్నలు దాడి, పార్వతమ్మ, దాడి నరసింహ(రిటైర్డ్ టీచర్) ల స్మారకార్థం విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు ఆదివారం తాటిపాముల గ్రామంలోని దేవాలయం దగ్గర అందజేశారు. విద్యార్థులు చక్కగా పరీక్షలు రాసి 10/10 జీపీఏ సాధించాలని, తద్వారా గ్రామానికి, వనపర్తి జిల్లాకు రాష్ట్రస్థాయిలో పేరు తీసుకురావాలని ఆయన కోరారు. 10జీపీఏ తెచ్చుకున్న విద్యార్థులకు యోగానందరెడ్డి వారి తల్లిదండ్రుల స్మారకార్థం రూ.3016 అందజేస్తానని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బోయ అంకె శ్రీను, గంధం విష్ణు, అంకె యాదగిరి, బీచుపల్లి, వెంకటయ్య, గాడిమూడి బాలకిష్టి, గాడిమూడి మద్దిలేటి, గంధం బుచ్చన్న, కంచిరావుపల్లి రాముడు, గంధం బక్కమ్మ, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న దాడి యోగానంద రెడ్డి

## మృతుని కులుంబానికి ఆర్థిక సహాయం..

**అడ్డాకుల,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న అడ్డాకుల జడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి, ఆంజనేయులు పార్థివదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. వారి కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వపరంగా అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, ఉపసర్పంచ్ చిన్న బాలయ్య, పరుశురాములు, హెచ్.రాములు, ఎం.మన్యం తదితరులు పాల్గొన్నారు.



## 10వ తరగతి వార్షిక పరీక్ష ఏర్పాట్లను పరిశీలించిన స్పెషలాఫీసర్, ఎంఈఓ, ఎంపీడీఓ..

**వీపనగండ్ల,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** నేడు ప్రారంభం కానున్న 10వ తరగతి వార్షిక పరీక్షల ఏర్పాట్లను స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, ఎంపీడీఓ కతలప్ప ఆదివారం పరిశీలించారు. మండల కేంద్రంలోని బాలుర, బాలికల పరీక్ష కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు. వేసవికాలం దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా త్రాగు నీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ పరీక్ష కేంద్రానికి చుట్టుపక్కల 8గ్రామాల విద్యార్థులు మొత్తం 170 మంది హాజరవుతారని అన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని వారు సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ నరేష్ గౌడ్, సీఆర్పీ వెంకటేష్, గ్రామ సర్పంచ్ నరసింహా రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, విద్యా కమిటీ చైర్మెన్ శశిధర్‌లు పాల్గొన్నారు.



## మహిళలు రాజకీయాల్లో రాణించాలి...

**-జాతీయ మహిళా మోర్చా కార్యదర్శి నళినిరామన్**

**కల్వకుర్తి, ఏప్రిల్ 02 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గ బీజేపీ మహిళా మోర్చా కార్యవర్గ సమావేశాన్ని కల్వకుర్తి పార్టీ కార్యాలయంలో కల్వకుర్తి మహిళా మోర్చా మున్సిపల్ అధ్యక్షురాలు కొన్‌రెడ్డి ఇందిర అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మహిళా మోర్చా జాతీయ కార్యదర్శి నళినిరామన్, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నళినిరామన్ మాట్లాడుతూ మహిళలు రాజకీయాల్లో రాణించాలని, మోడీ నాయకత్వంలో దేశం పురోగతి సాధిస్తుందని, అన్ని రంగాల్లో మహిళా శక్తి కనబర్చాలని, రాబోవు ఎన్నికల్లో మహిళలంతా బీజేపీకి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బల్మూరి జానకి, బీజేపీ జిల్లా కార్యదర్శి గీతారాణి, మున్సిపల్ కౌన్సిలర్ మంజుల, వెల్దండ ఎంటీపీసీ ఎన్నం ఉమా, కుప్పగండ్ల సర్పంచ్ శారదమ్మ, ముకురాల మాజీ సర్పంచ్ పద్మతో పాటు మహిళా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.




## నేటి నుండి 10వ తరగతి పరీక్షలు..

**పాన్‌గల్,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** 2022-23 విద్యాసంవత్సరం 10వ తరగతి వార్షిక పరీక్షలు నేటితో ప్రారంభం కానున్నాయి. కాగా పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ సూచించారు. మండలంలో 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా రేమొద్దుల గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులు మాత్రం గోపాల్‌పేట మండలంలో పరీక్షలు రాయగా మిగిలిన 9ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు మండల కేంద్రంలోని కస్తూర్బా తిలరాళ్లపల్లి గ్రామంలోని ప్రైవేట్ పాఠశాల లిటిల్ స్టార్స్ పాఠశాల విద్యార్థులు మొత్తం 220 బాలురు 140మంది బాలికలు మొత్తం 360మంది విద్యార్థులు మండల కేంద్రంలోని నిర్వహించే పరీక్ష కేంద్రాల్లో పరీక్షలకు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. 10పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల సహకారంతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి..



**పెబ్బేరు,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి పెబ్బేరు మండల కేంద్రంలో ఘనంగా జరుపుకు న్నారు. ఆదివారం స్థానిక సుభాష్ చౌరస్తాలో సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణ శ్రీసాయి, వైస్ చైర్మెన్ కర్రస్వామి తో పాటు గౌడ సంఘం నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భం గా ఆయన చేసిన సేవలను వారు కొనియాడారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఆయన ఎనలేని సేవలు చేశారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు అక్కి శ్రీనివాస్ గౌడ్ తో పాటు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## 1998-99 బ్యాచ్ ఆధ్వర్యంలో చలివేంద్రం..

**మూసాపేట,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** మూసాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,బస్టాండ్ దగ్గర 1998-99లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో చలి వేంద్రం ఏర్పాటు చేశారు. 1998-99 బ్యాచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసిల్దార్ మంజుల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షుడు భాస్కర్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల బీసీ సంఘం అధ్యక్షుడు కొండయ్య, రాజు, అప్పి, సలీం, దేవన్న, ప్రమోద్, రాములు, టైలర్ శ్రీను, టైలర్ కృష్ణ సాగర్, నవీన్ రెడ్డి, ఎర్రన్న, ప్రవీణ్ రెడ్డి, శ్రవణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## గుండెపోటుతో బీఆర్ఎస్ కార్యకర్త మృతి..

**పెబ్బేరు,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వైశాఖాపూర్ గ్రామంలో శనివారం రాత్రి గుండెపోటుతో బీఆర్ఎస్ కార్యకర్త విష్ణు నాయుడు (35)మృతి చెందాడు. ఇతనికి భార్య సంధ్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం విష్ణు నాయుడు అంత్యక్రియల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు యాదవ్, శ్రీరంగాపూర్ సింగిల్‌విండో చైర్మెన్ జగన్నాథం నాయుడు, పెద్దింటి వెంకటేష్, సర్పంచ్ మేకల రవి కుమార్ యాదవ్, తోమాలపల్లి మధు, పెబ్బేరు సింగిల్‌విండో వైస్ చైర్మెన్ జక్కుల ఆంజనేయులు, విష్ణు నాయుడు లు నివాళి అర్పించారు. విష్ణు కుటుంబాన్ని మంత్రి అన్ని విధాల ఆదుకుంటామని అన్నారని తెలిపారు. మంత్రి రెండు రోజుల తరువాత కుటుంబాన్ని పరామర్శిస్తారని, విష్ణు కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం కల్పించాలని తెలిపారు. విష్ణు నాయుడు కుటుంబానికి మంత్రి అండగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## భూముల వివరాలు అప్‌లోడ్ చేయాలి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 2, ప్రభాతవార్త:**సాంఘిక సంక్షేమ ఇండ్ల పట్టాలకై గతంలో గుర్తించిన భూముల వివరాలను సోమవారంలోగా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ రవి నాయక్ తాసిల్దార్లను ఆదేశించారు. ఆదివారం రెవెన్యూ అధికారులు, తాసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో 7 మండలాల్లో భూములను సేకరించడం జరిగిందని ఆ వివరాలు మీ సేవ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన స్కెచ్,భూముల వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలను తాసిల్దార్ల స్థాయిలో అప్‌లోడ్ చేసిన తర్వాత ఆర్డీవో లాగిన్‌కి రావడం జరుగుతుందని, అనంతరం ఆర్డీవో లాగిన్ నుంచి కలెక్టర్ లాగిన్‌కు వస్తాయన్నారు. వర్క్ ఫ్లో చార్ట్‌ను ఆయన తాసిల్దార్లకు వివరించారు. సోమవారం నాటికి పూర్తి వివరాలు తనకు అందించాలని ఆదేశించారు. వీసీలో అదనపు కలెక్టర్ సీతారామారావు, ఆర్డీవో అనిల్‌కుమార్ పాల్గొనగా, తాసిల్దార్లు వీసీకి హాజరయ్యారు.

# మన హృదయం.. జర పదిలం..!

**దేవరకద్ర,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** నిద్రలోంచి లేస్తూ...కూర్చున్నవారు కూర్చున్నట్లే కుప్పకూలుతున్నారు.ఏమైందో తెలిసేలోపే తుదిశ్వాస వదులుతున్నారు.అప్పటి వరకు మనతో కలసిమెలసి ఉండి..నవ్వుతూ మాట్లాడి..ఆహ్లాదంగా గడిపిన ఆత్మీయులే హఠాన్మరణం పొందడం విషాదకరం.ఇందులో యువత నుంచి నడివయసు వారి వరకు ఉండటం విచారకరం.వయసుతో సంబందం లేకుండా మృత్యువుఒడికి చేరుతుండటం ఆలోచించాల్సిన విషయం.ప్రధానంగా కాలంతో పరుగెత్తడం,వ్యక్తిగత సమస్యలు, కరోన తర్వాత మారిన జీవనశైలి,ఆహారపు అలవాట్లు,శారీరక శ్రమ తగ్గడం,వర్క్ ఫ్రం హోమ్ అలవాట్లు పెరడగం వంటివి హృదయం అగేలా చేస్తున్నాయని వైధ్యులు అభిప్రాయపడుతున్నారు.చాలా కుటుంబాలను విషాదంలోకి నెట్టి వేస్తూ..ఆప్తులకు కన్నీరు మిగుల్చుతున్నాయి. ఈ క్రమంలో జాగ్రత్తలు, అలవాట్లను మార్చుకొంటే గుండెపోటు నుంచి తప్పించుకోవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



- చిన్నవయసులోనే గుండెపోట్లు..
- జిల్లాలో వరుసగా నమోదవుతున్న ఘటనలు..
- శారీరక శ్రమ,వ్యాయామం లాంటివి చేస్తేమేలు..
- గాడి తప్పిన ఆహారపు అలవాట్లకు చెక్‌పెట్టాల్సిందే..
- చిన్నజాగ్రత్తలు తీసుకుంటే పెద్ద ముప్పు నుంచి తప్పించుకోవచ్చు..



### ఉరుకుల..పరుగుల జీవితం..

ఉరుకుల..పరుగుల జీవితం..ప్రతి ఒక్కరూ ఎవరి స్థాయిలో వారు ఉద్యోగ..వ్యక్తిగత సమస్యలతో సతమతమవుతున్నారు. ఒత్తిడిలో పనిచేస్తూ బీపీలు,షుగర్‌లు,కిడ్నీ సంబందిత వ్యాధులు తెచ్చుకొంటున్నారు.దీర్ఘకాలంలో అవి గుండెపోటుకు దారి తీసున్నాయి. కాని ప్రస్తుతం వయసుతో సంబందం లేకుండా చిన్న వయస్సులోనే గుండెపోటుతో మృత్యువాత పడుతున్న ఘటనలు ఎన్నో చూస్తున్నాం.జిల్లాలో ఈ మద్య కాలంలో గుండెపోటుతో మృతిచెందుతున్న వారి సంఖ్య చాలా ఎక్కువవుతున్నాయి.మృతి చెందుతున్న వారిలో 17 ఏళ్ళ మొదలు 50ఏళ్ళ లోపువారే అధికంగా ఉంటున్నారు.డ్యాన్స్‌లు చేస్తూ మొదలు ఏదైన పనిచేస్తూ..ఉన్నట్టుండి అకస్మాత్తుగా కుప్పకూలిపోతున్న వీడియోలు ఎన్నో సోషల్‌మీడియాలో చెక్కర్లు కొడుతున్నాయి.దీంతో చాలా మందిలో భయం మొదలైంది.ఛాతిలో గ్యాస్ ప్రాబ్లమ్‌తో నొప్పి లేసినా,మంట లేసినా వెంటనే అసుపత్రులకు క్యూకడుతున్నారు.

కరోన అనంతరం మారిన జీవన శైలి..మనసిక వత్తిడి...శారీరక శ్రమ తగ్గిపోవడం..వర్క్‌టు హోం పెరగడం..జంక్‌ఫుడ్స్‌కు అలవాటుపడటం,, ఇవన్ని గుండెకు ఇబ్బంది పెడుతున్నాయి.గాడి తప్పిన ఆహారపు అలవాట్లతో వచ్చే ఉబకాయ సమస్య, మధుమేహం,బీపి,షుగర్,కిడ్ని సమస్యలకు దారి తీస్తున్నాయి.చివరకు అవి గుండెపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయి.ఈ నేపథ్యంలో చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకొంటూ,మంచి అలవాట్లను అలవర్చుకొంటే గుండెపోటు అనే పెద్ద ముప్పు నుంచి తప్పించుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

### క్రమశిక్షణతో కూడిన జీవనశైలి అవసరం..

ధూమ,మద్యపానం,అధికమాంసం వినియోగం మంచిదికాదు.అవి గుండెకు అవి తీవ్రమైన హానిచేస్తాయి.వ్యాయామం,యోగా,మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలి.యువతకు హార్ట్‌అటాక్ వస్తుంది అంటే క్రమశిక్షణతో కూడిన జీవనశైలి లేకనోవడమే ప్రధానకరణమని చెబుతున్నారు.ఆయాసం,గుండెనొప్పి,ఎక్కువ చెమటలు పట్టడం,కళ్ళుతిరడం మొదలైన లక్షణాలుంటే వెంటనే వైధ్యులను సంప్రదించడం మంచిది.

### ఆహారపు అలవాట్లు..శారీరక శ్రమ ముఖ్యం..

అధికంగా చక్కెర,ఉప్పు,కొవ్వు పదార్థాలు ఉన్న ఆహారం తీసుకోవడంతో రక్త సరఫరా చేసే రక్తనాళాలు మూసుకపోతాయి.ఆ సమయంలో గుండెకు ఆక్సిజన్ అందక గుండెపోటు వస్తుంది.ప్రస్తుత బిజి లైఫ్‌లో దొరికిన ఆహారాన్ని తినేస్తుంటారు.ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటుపడుతున్నారు.ఆహార నియమాలను పూర్తిగా మరచిపోతున్నారు.దీనికి మానసిక వత్తిడి కూడా తొడవుతుంది.శారీరక శ్రమలేకపోవడం,అధిక బరువు గుండె జబ్బుకు కారణం అవుతున్నాయి.

### వీటికి దూరంగా ఉండి గుండెకు భారం తగ్గించాలి..

రోజూ పండ్లు,కూరగాయలు ఆహారంగా తీసుకోవాలి.ఫాస్ట్‌ఫుడ్స్, ఎగ్‌పఫ్స్,మిర్చి.పానిపూరి లాంటి చిరుతిడ్లు సాధ్యమైనంత వరకు మానేయడం మంచిది.వాటి స్థానంలో పండ్లు తీసుకోవడం అలవాటు చేసుకోవాలి.శీతల పానీయాలను తగ్గించాలి.తప్పని పరిస్థితుల్లో అయితే మోతాదుకు మించి తీసుకోకూండా చూసుకోవాలి. కొవ్వు తక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి.చికెన్,మటన్ కంటే గుడ్లు,చేపలు లాంటివి తీసుకోవడం మేలు.శారీరక శ్రమ,వ్యాయామం మొదలైనవి చేయాలి.ఇలా చేస్తే ఉబకాయం, మధేమేహం,రక్తపోటు స్థాయిని నియంత్రించుకోవచ్చు.శరీరంలో నుంచి కొలెస్ట్రాల్ పెరిగి చెడు కొలెస్ట్రాల్ తగ్గేందుకు ఇదే సరైన మార్గం.రోజూ 30 నుంచి 45 నిముషాల వరకు మితమైన తీవ్రమైన శారీరక శ్రమ చేయాలి.స్మోకింగ్ అలవాటు ఉన్నవారు మానేయాలని వైద్యనిపుణలు సూచిస్తున్నారు.

# క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి...

### క్రీడలు స్నేహ బంధాన్ని పెంచుతాయి:ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్




విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



రన్నర్ జట్టుకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం




ఫైనల్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న ఇరు జట్ల నిర్వాహకులు

కల్వకుర్తి, ఏప్రిల్ 02, ప్రభాతవార్త:క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించినప్పుడే నిజమైన క్రీడాకారులుగా రాణించగలుగుతారని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడలు స్నేహబంధాన్ని పెంచుతాయని ఆయన అన్నారు. కల్వకుర్తి ప్రీమియర్ లీగ్-2 క్రికెట్ పోటీలను కల్వకుర్తి పట్టణంలోని మినీ స్టేడియంలో 12 జట్లతో 14 రోజుల పాటు నిర్వాహకులు నిర్వహించారు. ఆదివారం ఫైనల్‌కు ఎంజెఆర్ జట్టు, చీమర్ల అర్జున్‌రెడ్డి జట్లు చేరుకోగా ఫైనల్ మ్యాచ్‌కు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, బీఆర్ఎస్ నాయకులు బృంగి ఆనంద్‌కుమార్, ఎంజెఆర్ జట్టు నిర్వాహకులు ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి, చీమర్ల అర్జున్‌రెడ్డి, ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా విచ్చేసి టాస్ వేసి ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. చీమర్ల అర్జున్‌రెడ్డి విన్నర్‌గా నిలువగా, ఎంజెఆర్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. ఓటమి గెలుపుకు నాంది అని, ప్రతి క్రీడాకారుడు ఓటమి చెందితే నిరుత్సాహ పడవద్దని, భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధించేందుకు అవకాశాలు కలిసి వస్తాయని భావించి క్రీడాకారులతో స్నేహ పూర్వకంగా కలిసి మెలిసి ఉండాలన్నారు. క్రీడల వల్ల ఎక్కడో ఉన్న వ్యక్తులతో పరిచయాలు ఏర్పడి స్నేహబంధాలు ధృడంగా మారి ఎన్నో అవకాశాలు కలిసి వస్తాయని, వాటితో అభివృద్ధి చెందేందుకు కూడా ఉపయోగపడుతాయని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ క్రీడలను పెంపొందించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులకు, గ్రామ యువకులకు పొత్సాహం కల్పించి క్రీడలను మరుగున పడకుండా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఎంతైన ఉందన్నారు. నిర్వాహకులు ఎమ్మెల్యేతో పాటు జట్ల యాజమాన్య సభ్యులను, పలువురు నేతలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దుబ్బ నాగేష్, జహీర్, హరికృష్ణశర్మ తదితరులు ఉన్నారు.

## బీసీలపై దాడులు చేస్తే ప్రతి దాడులు తప్పవు..

**నియంత అండతోనే అరాచకాలు చేస్తున్న రౌడీ బ్రదర్స్..**

**సర్పంచి పైనే దాడిచేస్తే..సామాన్య ప్రజల సంగతేంటి..?**

**రౌడీ బ్రదర్స్‌పై క్రిమినల్ కేసులు పెట్టాలి..**

**బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్..**



కబ్జాకు చేసేందుకు ప్రయత్నిస్తున్న భూమిని పరిశీలిస్తున్న రాచాల

వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 02 ప్రభాతవార్త: బీసీ లపై దాడులు చేస్తే ప్రతి దాడులు తప్పవని, బీసీ పొలిటికల్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ హెచ్చరించారు. ఆదివారం పెద్దమందడి మండల కేంద్రంలో దాడికి గురైన స్థానిక సర్పంచ్ వెంకటస్వామి సాగర్ ను పరామర్శించి ఆయనతో కలిసి దాడి జరిగిన స్థలాన్ని పరిశీలించారు,ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ పెద్దమందడి మండలంలో మంత్రి అండతో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, ఆయన సోదరుడు సింగిల్‌విండో అధ్యక్షుడు విష్ణువర్దన్ రెడ్డి అక్రమాలు అరాచకాలు ఎక్కువయ్యాయని, పేదల భూములు కబ్జా చేయడమే కాకుండా రాత్రిపూట అక్రమ ఇసుక వ్యాపారం నిర్వహిస్తూ అనేక మంది చావుకు కూడా కారణమయ్యారని ఆరోపించారు. స్థానిక సర్పంచ్ కి పూర్వీకుల నుండి సంక్రమించిన ఆస్థిని కబ్జా చేసేందుకు జగదీశ్వర్ రెడ్డి ప్రయత్నిస్తూ మూడేళ్ల కిందట సర్పంచ్ సర్వేకు దరఖాస్తు పెట్టుకున్న కూడా సర్వేయర్ ని రాకుండా అడ్డుకున్నాడని, చివరికి తహసిల్దార్ ఆదేశాలతో శనివారం సర్వేయర్ వస్తున్నాడన్న సమాచారం తెలుసుకొని ఎలాగైనా సర్వేను అడ్డుకోవాలన్న ఉద్దేశంతో సర్పంచ్ అతని కుటుంబ సభ్యులపై దాడి చేశారని అన్నారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈ ఘటన జరిగిందని, గ్రామ ప్రథమ పౌరుడికి ఈ విధంగా జరిగితే సామాన్యప్రజల సంగతేంటని ప్రశ్నించారు. సర్పంచ్ స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నించడమే కాక, సర్పంచ్ పై, అతని కుటుంబ సభ్యులపై దాడి చేసిన జగదీశ్వర్ రెడ్డి, విష్ణువర్దన్ రెడ్డిలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. మళ్లీ ఇటువంటి దౌర్జన్యాలకు పాల్పడితే ఉపేక్షించబోమని, తిరగబడి తరమికొట్టేందుకు కూడా బీసీలు వెనకాడరన్న సంగతి గుర్తుంచుకోవాలని హితవుపలికారు.ఈ కార్యక్రమంలో మనిగిల్ల శివయాదవ్, వివకానంద, నరేష్, యాదన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లాకు రాష్ట్ర స్థాయిలో పేరు తీసుకురావాలి..

**కౌన్సిలర్ కంచ రవి**

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలోని 6వ వార్డు తిరుమల కాలనీలో ఉన్న పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు కౌన్సిలర్ కంచ రవి ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. నేటి నుండి ప్రారంభమయ్యే పరీక్షల దృష్ట్యా ఆయన 10వ తరగతి విద్యార్థులకు ప్యాడ్ లు పంపిణీ చేయడం జరిగింది, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు బాగా రాసి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే రాష్ట్రంలో వనపర్తి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ జీవిత, కంచ శ్రీకాంత్, వోడీ వెంకీ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్యాడ్ లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ కంచ రవి

## హాత్ సే హాత్ జోడో యాత్రలో పాల్గొన్న కాటం ప్రదీప్..



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కాటం ప్రదీప్ కుమార్ గౌడ్

**మూసాపేట,ఏప్రిల్ 02 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వేముల గ్రామంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి కాటం ప్రదీప్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం హాత్ సే హాత్ జోడోయాత్ర కార్యనరకమం నిర్వహించారు. గడప గడపకు తిరుగుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ 2024జనవరిలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని అన్నారు. జాగవున్న ప్రతి ఒక్క నిరుపేదకు రూ.5లక్షలు ఆర్థిక సమాయం చేసి ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని తెలిపారు. అలాగే రూ.500 గ్యాస్ సిలిండర్ అందజేస్తామని ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం అందజేస్తామని తెలిపారు. ఒకేసారి రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామని, వరి పంటకు మద్దతు ధర రూ.2,500 అందజేస్తామని తెలిపారు. రైతులకు, కౌలు రైతులకు సంవత్సరానికి రూ.15వేలు పెట్టుబడి సహాయం కింద చేస్తామని తెలిపారు. భూమిలేని ఉపాధి కూలీలకు సంవత్సరానికి రూ.12వేల సహాయం చేస్తామని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఓబీసీ నాయకులు వేణుగోపాల్, టీసీ శ్రీనివాస్, దేవరకద్ర నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల అక్కి రాఘవేందర్ గౌడ్, చిన్నచింతకుంట మండల కోఆప్షన్ మహ్మద్, లాల్‌కోట ఎంపీటీసీ శివరాజ్, దేవరకద్ర, చిన్నచింతకుంట, కొత్తకోట మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాందాస్, వెంకటేశ్వర్ రెడ్డి, నరోత్తం రెడ్డి, వేముల గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్, నరసింహులు, రాఘవరెడ్డి, తిరుపతయ్య, వీరస్వామి, నాగన్న, సత్యన్న, వెంకటయ్య, లాల్‌కోట వేణుగోపాల్, మల్లేష్, చెన్నల్ గౌడ్, మల్లికార్జున, వెంకటేష్, నరసింహులు, ఇంద్రుచ లింగం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే విధానంగా కేసీఆర్ పాలన : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :** ఎల్బీనగర్ నియోజకవర్గం బి.ఎన్. రెడ్డి.నగర్ డివిజన్‌లోని ఎస్.కె.డి.గ్రౌండ్స్‌లో డివిజన్ భారాస అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రాష్ట్ర విద్య శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బుగ్గారపు దయనంద్ గుప్తా విచ్చేసారు. ఈ సందర్భంగా మంత్రి సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ అబివృద్దే మా నినాదాంగా ప్రజల సంక్షేమమే మా విధానంగా కేసీఆర్ పాలన కొనసాగుతుందని తెలిపారు. ప్రజలకు అవసరమైతే చట్టాలను మార్చి సమస్యలు పరిష్కరించాలని, అది భారాస పాలనతో సాధ్యమైందని తెలిపారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం కేసీఆర్ విజన్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అదే విధంగా ఎల్.బి.నగర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుందన్నారు. త్వరలో సవరణలతో కూడిన 118 జీ.ఓ.ను తెస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చామన్నారు. ఆస్తిపన్ను తగ్గింపు, రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారం, చెరువుల సుందరికారణ వంటి హామీలు నెరవేర్చామని తెలిపారు. నియోజక వర్గపరిధిలో ఉన్న పార్కులు దేశంలో ఎక్కడ లేవని తెలిపారు. 3 వేల కోట్ల రూపాయలతో జాతీయ రహదారితో పాటు సాగర్ హైవే, ఇన్నర్ రింగ్ రోడ్డులలో ట్రాఫిక్‌చిక్కులకు చెక్‌పెడుతూ, దాదాపు 658 కోట్ల రూపాయలతో ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించి ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తీర్చిదిద్దామని తెలిపారు. రాబోయే రోజుల్లో ఎల్.బి.నగర్ నియోజకవర్గంలో భారాస జెండా ఎగరడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాధవరం నర్సింహారావు, సుమన్ గౌడ్, అనిల్ చౌదరి, బుచ్చిరెడ్డి, కొంగర మహేష్, శివశంకర్, రమేష్ నాయుడు, కాజా శ్రీనివాస్, నరేందర్ గౌడ్, సువర్ణ రెడ్డి, నిర్మల, తిరుమలేష్, సతీష్ చౌదరి, పలువురు నాయకులు, ఉద్యమకారులు, మహిళలు, కార్యకర్తలు, పలు కాలనీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# మతతత్వ విద్వేషాలతో ప్రజల మధ్య కార్చిచ్చు పెట్టి రాజకీయం చేస్తున్న బిజెపి



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**భావితరాలకు బాసటగా అభివృద్ధి చేస్తాం: సుధీర్‌రెడ్డి**

**మన్సూరాబాద్, ప్రభాతవార్త:** సోషల్ మీడియాలో మత తత్వ విద్వేషాలతో ప్రజల మధ్య కార్చిచ్చు పెట్టి ఆ మంటలతో రాజకీయం చేస్తున్న ఏకైక పార్టీ బిజెపి అని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. మన్సూరాబాద్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి ఆధ్వర్యంలో డివిజన్‌స్థాయి నాయకులు,కార్యకర్తలతో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ నగరంలోనే ఎక్కడా లేని విధంగా ఎల్బి నగర్ అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఆటో నగర్ డంపింగ్ యార్డు స్థలంలో ఎక్కడా లేని విదంగా పార్కును అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. అదేవిదంగా బస్ టెర్మినల్ సైతం నిర్మించి తన సత్తా చాటుతామని పేర్కొన్నారు. బిజెపి రాజకీయ లబ్ధికోసం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా మ్యాన్‌పెస్టులు పెడుతూ పైకి మాత్రం హిందుత్వం అంటూ ప్రజలను మోసం చేస్తుందని, దీనిని ప్రజలు గమనించాలన్నారు. దమ్ముంటే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఒక్క మెడికల్ కాలేజ్ రాష్ట్రానికి ఇప్పించాలని డిమాండ్ చేశారు. తాము ఎన్నికలకోసం పని చేయమని, కేవలం భావితరాలకు మంచి భవిష్యత్‌ను ఇవ్వాలనే ఉద్దేశంతో నేటినుండే నగరాభివృద్ధికోసం పాటుపడుతామన్నారు. కార్యక్రమానికి ముందు డివిజన్ మాజీ ఆధ్యక్షుడు చుక్కమెట్టు శ్రీకాంత్‌రెడ్డికి నాయకులు, కార్యకర్తలు మౌనం పాటించి శ్రద్దాంజలి ఘటించారు. ఈకార్యక్రమంలో ఎంఎల్‌సి బొగ్గారపు దయానంద్, హనుమాన్ టెంపుల్ చైర్మన్ ఈశ్వరమ్మయాదవ్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు టంగుటూరి నాగరాజు, కొసనం ధనలక్ష్మి, గుంతకండ్ల రాజశేఖర్‌రెడ్డి, జగదీష్‌యాదవ్, జక్కిడి రఘువీర్‌రెడ్డి, రుద్రాల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామ రక్ష : మంత్రి సబితారెడ్డి




బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న మంత్రి సబితారెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** తెలంగాణలో సిఎం కెసిఆర్ నాయకత్వాన్ని కాపాడుకోవాలనీ లేని పక్షంలో రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిలాగా అవుతుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ చప్పిడి అడవిరెడ్డి గార్డెన్స్‌లో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కెసిఆర్‌నుకాదని పాలన ఎవరికి ఇచ్చినా రాష్ట్రం అధోగతి అవుతుందని, కెసిఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాల ద్వారా ప్రజలకు మరింత చేరువవుతున్నామని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గ ప్రజలు గుర్తుంచుకునే విధంగా అభివృద్ధి, ప్రజా సంక్షేమం చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సహకరిస్తున్న సిఎం కెసిఆర్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శ్రీధర్, పార్టీ సీనియర్ నాయకుడు చప్పిడి సంతోష్‌రెడ్డి, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, కార్పొరేటర్లు ఏనుగు రాంరెడ్డి, సంరెడ్డి స్వప్న వెంకట్‌రెడ్డి, బోయపల్లి దీపిక శేఖర్‌రెడ్డి, ముత్యాల లలితా కృష్ణ, రామిడి కవితా రాంరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె ఖలీల్ పాష, మాజీ వార్డు సభ్యులు రామిడి తూఫాన్‌రెడ్డి, లగ్గాల సంజీవలతో పాటు కుంచ నాగేందర్‌గౌడ్, మల్గారి శ్రీపాల్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సిల్వేరి సాంబశివ, సరిత, శివానీరెడ్డి, మణెమ్మ, భారతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు



మినీ శిల్పారామంలో కూడిపూడి నృత్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

**ఉప్పల్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం వసుమతి వరకల శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక కౌతం, దశావతార శబ్దం, జతి స్వరం, బ్రహ్మాంజలి, కృష్ణంకలయ సకి,జనుత శబ్దం, సరస్వతిస్తుతి, మహాగణపతిమ్, పుష్పాంజలి, రామదాసు కీర్తన, అన్నమాచార్య కీర్తన, శివగంగ నృత్య రూపకం తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు చైత్ర, శ్రేయ, వైష్టవి, ప్రణతి, కృష్ణసాయి, లక్ష్మి సుమేద, యోషిక బిందు తదితరులు తమ ప్రదర్శనలో ఆకట్టుకున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వహకులు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీలో మహిళల చేరిక



మల్‌రెడ్డి రాంరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మహిళలు

**సైదాబాద్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి సమక్షంలో పలు పార్టీలకు చెందిన మహిళా కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చమురు, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి యవత మద్దతుగా నిలవాలని రాంరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, నాయకులు లింగాల కిషోర్ గౌడ్, మల్లారపు శ్రీనివాసరావు, మతీన్ షరీఫ్, సురేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, యాదగిరి, కిరణ్, శివ, రాము యాదవ్, యాదమ్మ, అనిత, సరిత, సౌమ్యరెడ్డి, అలివేలు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తేవాలి



ఐక్యత చాటుతున్న నర్సింహారెడ్డి, పారిజాత, భాస్కర్‌రెడ్డి, జంగారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తేవడానికి పార్టీలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గంలోని కీలకమైన బడంగ్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. పార్టీ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్‌లోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశనం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జడ్పీ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి, భాగ్యనగర్ సొసైటీ వైస్ ఛైర్మన్ బంగారు బాబు, బడంగ్‌పేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పక్ష నాయకుడు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర మహేశ్వరి జైహింద్, నేనావత్ బాలు నాయక్, పార్టీ సీనియర్ నాయకులు గట్టు బాలకృష్ణ, నవారు మల్లారెడ్డి, బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఒపెన్ జిమ్ పనులకు శంకుస్థాపన : బేతి



ఒపెన్ జిమ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ గీత

**ఉప్పల్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ రాఘవేంద్రనగర్ కాలనీలో రూ.పదిన్నర లక్షల వ్యయంతో చేపడుతున్న ఒపెన్ జిమ్ పనులకు ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా డివిజన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని వర్గాల సమన్యాయం జరుగుతుందన్నారు. ప్రణాళికబద్దంగా డివిజన్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. చిలుకానగర్ డివిజన్‌లో అన్ని ప్రాంతాల్లో ఒపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డివిజన్ అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఎల్.నాగేందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ నాయకులు బద్దం భాస్కర్‌రెడ్డి, బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, ఏదుల కొండల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పల్లె నర్సింగ్‌రావు, పిట్టల నరేష్, కొంపల్లి రవీందర్, రాజు, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, పండ్ల కిషన్‌గౌడ్, నారాయణరెడ్డి, అశోక్‌చారి, అబ్బూబాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి

**వనస్థలిపురం, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :** బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 313వ వర్ధంతి సందర్భంగా హస్తినాపురం డివిజన్ నందనవనం కాలనీలో హస్తినాపురండివిజన్ నందనవనం కాలనీ గౌడ సంఘం అధ్యక్షులు జువ్వగాని రాజుగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోల్కొండకోటతో పాటు తెలంగాణ ప్రాంతంలో సుమా రు 32కోటలను జయించి బడుగు బలహీనవర్గాలకు రాజ్యాధికారాన్నీ అందిం చిన గొప్ప చక్రవర్తి పాపన్నగౌడ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కృష్ణ, శ్రీశైలం, పండాల రాజశేఖర్‌గౌడ్, కపురానాయక్ , దర్గా శ్రీను, పనస యాదగిరి గౌడ్, విష్ణు గౌడ్, మేడి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేణుకనగర్ ప్రధాన రోడ్డు నిర్మించాలని వినతి

**జవహర్‌నగర్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :** జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 2వడివిజన్ రేణుకనగర్ ప్రధాన రోడ్డు విషయంలో అడ్డుపడుతున్న వారిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపి అధ్యక్షులు రంగుల శంకర్ అదివారం కాప్రా తహశిల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఎన్నో యేళ్ళనుండి కార్మికనగర్, రేణుకనగర్‌లో నివాసముంటున్న ప్రజలు ప్రధాన రహదారి లేక ఇబ్బందుల ఎదురు కుంటున్నారని, ప్రధాన రహదారికి కనెక్టివిటిరోడ్డు నిర్మాణ విషయంలో పలువురు అడ్డుపడుతన్నారనే అరోపణలు సైతం వస్తున్నాయి. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి కనెక్టివిటి రోడ్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తిరెడ్డి, శ్రీరామ్, శివ, శ్రీనివాస్, మడికొండ విన య్, ఊర్మిళ, రఫియా బేగం, శ్రీరామ్, రేణుక, పద్మమ్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో చలివేంద్రాలు దోహదం చేస్తాయి : కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి..

**జవహర్‌నగర్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :** వేసవి కాలంలో చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని మల్కాజిగిరి సర్కిల్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. అదివారం డివిజన్ పరిధిలోని యాప్రాల్ భగత్ సింగ్ నగర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల బాలుర హాస్టల్ వద్ద టిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రవీణ్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వేసవి కాలంలో పాదాచారులు, వాహనదారులు, ప్రయాణీకులకోసం చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టిఅర్ఎస్ నాయకులు ప్రవీణ్‌కుమార్, రమేష్, శ్రీధర్, సుదర్శన్, ప్రభాకరన్, సన్నీ, ముఖేష్ పాల్గొన్నారు.

## ఉస్మాన్‌నగర్ ముంపు బాధితుల సమస్యలు తీర్చాలి : అమరేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీపరిధిలో బురాన్‌ఖాన్‌చెరువు ముంపుబాధితులైన ఉస్మాన్‌నగర్ వాసుల సమస్యలు తీర్చాలని టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంజాన్ నెల నేపథ్యంలో ఉస్మాన్‌నగర్ ముంపు బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద జరిగిన ధర్నాకు ఆయన హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు మూడేళ్లనుండి ఉస్మాన్‌నగర్‌తో పాటు సమీపకాలనీవాసులు ముంపు సమస్యల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి సమస్యలు తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు అహ్మద్ బామ్, రషీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## 'యు టర్న్' ఏర్పాటు చేయాలి : సామ

**సైదాబాద్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** ఎల్బినగర్ నుండి యు టర్న్ లేకపోవడంతో లింగోజిగూడ డివిజన్ ఎస్‌బిహెచ్ కాలనీ ఫేజ్-1,2,3, శాతవాహన నగర్, కాకతీయ కాలనీ, మైత్రినగర్, సౌభాగ్యనగర్, కృష్ణానగర్, శివపురి కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే యు టర్న్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా బిజెపి అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి ఎల్బినగర్ ట్రాఫిక్ డిసిపికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగోలు కార్పొరేటర్ చింతల సురేందర్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు రాచమల విజయ్‌భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ ం రాజు, వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు రామేశ్వర్, చారి, వెంకటిచారి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డును నిర్మించాలని మంత్రి సబితాఇంద్రారెడ్డికి బిజెపి నేత వినతి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో శిథిలావస్థలో ఉన్న లెనిన్‌నగర్ శివాలయం రోడ్డును నిర్మించాలని రాష్ట్ర బిజెపి దళితమోర్చా నాయకుడు చవ్వ శ్రవణ్‌కుమార్ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం మంత్రిని కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాల క్రితం వేసిన రోడ్డు అధ్వాన్నంగా మారిందనీ దీంతో స్థానిక ఐదు డివిజన్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో కొత్త రోడ్డును నిర్మించాలని ఆయన మంత్రికి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా పేదలు అధికంగా నివసించే 34 డివిజన్ అభివృద్ధి కోసం రూ.1.50 కోట్లు కేటాయించాలని కోరారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి చేర్చాలి

**సైదాబాద్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకువెళ్లాలని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు మమత అన్నారు. ఐఎస్ సదన్ డివిజన్ సుబ్రమణ్యంనగర్ కాలనీ పార్కులో జరిగిన బూత్ కార్యవర్గ సమావేశానికి స్థానిక కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డితో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో విజయం సాధించాలంటే బూత్ స్థాయి నుంచే పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమ ంలో సుభాష్ చందర్జీ, దశరథలక్ష్మి, నాయకులు వీరేందర్‌రాబు, అమర్నాథ్‌రెడ్డి, రేణుక ముదిరాజ్, రమాదేవి, శాలిని, జమున తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి కృషి : కార్పొరేటర్ షాహిద్

**మలక్‌పేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :** పేద ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని చావుని డివిజన్ కార్పొరేటర్ సాలం షాహిద్ పేర్కొన్నారు. చావునిలోని తన కార్యాలయంవద్ద జరిగిన కార్యక్రమంలో పలువురు పేద ప్రజలకు ఆయన నిత్యావసర సరుకులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు సుమారు 200ల మంది పేద ప్రజలకు నిత్యావసర వస్తువులను అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. పండుగలు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. డివిజన్‌లో నిత్యం పర్యటిస్తూ వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.

## నేడు ఉప్పల్‌లో బిజెపి దళిత సింహ గర్జన

**ఉప్పల్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :** బిజెపి దళిత మోర్చ ఆధ్వర్యంలో సోమవారం ఉప్పల్ చౌరస్తాలో దగాపడ్డ దళితుల సింహాగర్జన నిర్వహిస్తున్నట్లు బిజెపి దళిత మోర్చ అర్బన్ జిల్లా కార్యదర్శి ఏసూరి యాదగిరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో అర్హులైన దళితులందరికి దళితబంధు అందజేయాలని, దళితబంధు బిఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమే కాకుండా ప్రతి దళిత కుటుంబానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ తాళ్లపల్లి లింగం, జిల్లా కార్యదర్శి శామీర్‌పేట చంద్రయ్య, ఉప్పల్ దళిత మోర్చ అధ్యక్షులు దువ్వాల రమేష్, జ్యోతి, నాయకులు మీసాల జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే బేతి



ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బేతి తదితరులు

**ఉప్పల్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు వేముల సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎనిమిదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మూడోసారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం సాధించి మూడోసారి అధికారం చేపడుతుందన్నారు. పార్టీబలోపేతానికి కార్యకర్తలే కీలకమని, కార్యకర్తలకు తగిన గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాడూరి శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి, అరటికాయల భాస్కర్, లేతాకుల రఘుపతిరెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్,భాస్కర్‌రెడ్డి, మేకల మధుసూధన్‌రెడ్డి, చింతల నరసింహారెడ్డి, మస్క సుధాకర్, గొరిగె ఐలేష్, జహంగీర్, సత్యపాల్‌రెడ్డి, మైసయ్య, రత్నాకర్‌రెడ్డి, అనితారెడ్డి, రాణిరెడ్డి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి ఆదర్శం తెలంగాణ : సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్‌బినగర్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీరెడ్డి సుదీర్‌రెడ్డి పేర్కొన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ టిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, డివిజన్ బారాస అధ్యక్షులు శ్రీశైలంయాదవ్ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక ప్రజాసంక్షేమపథకాలు ప్రవేశపెడుతున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కి దక్కుతుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రబుత్వం ఒక లక్షయంతో ముందుకు సాగుతుందన్నారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో జరిగిన అభివృద్ధితో రూపురేఖలు మారిపోయాయన్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో జరగని అభివృద్ధి ఎల్బీనగర్లో జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బోగ్గరపు దయనంద్, బిచేనేపల్లి వెంకటేశ్వరరావు, ప్రేమ్‌నాథ్‌గౌడ్, రమేష్‌ముదిరాజ్, రమణారెడ్డి, మల్లిక, ఆనంద్‌గౌడ్, బాలాగౌడ్, రవిచారి, గండి సన్ని, శైలజ, విజయలక్ష్మి, ప్రతిక్ పాల్గొన్నారు.

# రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి : మల్‌రెడ్డి రంగారెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

**తుర్కయంజాల్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ పరిధిలో హత్ సే హత్ జోడోపాదయాత్ర తుర్కయంజాల్ మున్సిపాలిటీ 24వ వార్డు వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జోడో యాత్రలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు ఇంజాపూర్ నిర్వహించిన యాత్ర, సమావేశానికి ముఖ్యఅతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్‌రెడ్డి రంగారెడ్డి, శేఖర్‌గౌడ్, (మామ) కౌన్సిలర్లు నాయకులతో కలిసి కాలనీలో పర్యటించారు. మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదివారం మాట్లాడుతూ ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలంటే రాబోయే 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. అనంతరం ఇంజాపూర్‌లో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు కాకుమాను సునీల్, కౌన్సిలర్లు బొక్క రవీందర్‌రెడ్డి, అనిత చంద్రశేఖర్‌రెడ్డి, కవితశేఖర్‌గౌడ్, మేతరి అనురాధదర్శన్, కోండ్రు మల్లేష్, నక్క శివలింగంగౌడ్, మర్రి మాధవి మహేందర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలు జ్ఞాన నిధి : ఎమ్మెల్యే బేతి



గ్రంథాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ ప్రబుదాస్

**కుషాయిగూడ, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :** గ్రంథాలయాలు యువతకు జ్ఞాన నిధి అని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని మీర్పేట్ ఎస్ బి కాలనీ డివిజన్ మంగాపురం కాలనీలో సంక్షేమ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ జేరిపోతుల ప్రబుదాస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉంచేందుకు కృషి చేయాలని విద్యార్థులు ప్రజలు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, కాలనీ నాయకులు అశోక్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శివ, సోములు, శ్రీనివాస్‌గౌడ్, రామ్మోహన్, వెంకటరెడ్డి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుకుని ఉన్నత స్థాయిని చేరుకోవాలి : కరస్పాండెంట్ సుభాష్‌గౌడ్



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కరస్పాండెంట్ సుభాష్‌గౌడ్

**మలక్‌పేట, ఏప్రిల్ 2 ప్రభాతవార్త :** విద్యార్థులు అంకితభావంతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని మలక్‌పేటలోని శ్రీ వాణి విద్యా సంస్థల కరస్పాండెంట్ ఎం.సుభాష్‌గౌడ్ పేర్కొన్నారు. కళాశాలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపకబృందంతో పాఠ్యాంశాలను బోధిస్తూ వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. తమ విద్యా సంస్థలో విద్యతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించడానికి పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకుని లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు.

## ఎమ్మెల్యే చొరవతోనే లబ్ధి చేకూరింది

**ఎల్‌బినగర్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చొరవతోనే తమకు పట్టాలు లభించాయని లబ్ధిదారులు పేర్కొన్నారు. తెలంగాణ ప్రబుత్వం పేదలకోసం 58 జీవో జారీ చేసి పట్టాలు ఇవ్వడంతో చైతన్యపురి డివిజన్ న్యూఇందిరానగర్ కాలనీ వాసులు సిఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. పేద ప్రజలకు పట్టాలు రావడానికి సహకరించిన బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డిని, డివిజన్ అధ్యక్షులు తోట మహేష్‌యాదవ్‌లను లబ్ధిదారులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నరేష్, వైస్‌ప్రెసిడెంట్ కరుణాకర్, నర్సింహా, శివ, వెంకట్, నాయకులు కృష్ణ, జలంధర్ పాల్గొన్నారు.

## చంపాపేట చౌరస్తాలో చలివేంద్రం ప్రారంభం

**సైదాబాద్, ఏప్రిల్ 2 ప్రభాతవార్త:** ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయని మీర్‌పేట కార్పొరేషన్ కార్పొరేటర్ బైగళ్ల బాలమణి అన్నారు. బైగళ్ల బాబయ్య, పోచమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు బైగళ్ల రవీందర్ ఆధ్వర్యంలో చంపాపేట చౌరాస్తలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీకార్పొరేటర్ సామ రమణారెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గత 12 సంవత్సరాలుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాతంగి యాదగిరి, ఆరె కృష్ణ, ఈశ్వర్ గుప్తా, గోపాల్, అర్జున్, మల్లేష్, మాలాద్రి తదితరులు పాల్గొన్నారు.